క్లుప్తంగా

రూ.1.18 లక్షల విరాళం

గోకవరం: గ్రామంలో నిర్మిస్తున్న స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి గేదెల వెంకట రమణ మాస్టారు (గోకవరం) మంగళవారం రూ.1.18 లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని మంగళవారం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజాలకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కొరిపల్లి అప్పలస్వామి, పిల్లంగోరు పాపారావు, దోసపాటి సుబ్బారావు, తోట త్రిమూర్తులు, నంగినీడి రాంబాబు, సంగుల చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన చెరువులు



ఒమ్మంగిలో ఎండ తీవ్రతకు అడుగంటిన గోపాలుడు చెరువు

ప్రత్తిపాడు రూరల్: వేసవి ప్రారంభం నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వచ్చాయి. ఎండల తీవ్రతకు చెరువులు అడుగంటాయి. ఒమ్మంగిలోని రాజ్ చెరువు, గోపాలుడుచెరువు, చింతలూరు రామానుజం చెరువు, పెద్ద చెరువులతోపాటు పలు ఊర చెరువుల్లో నీరు ఆవిరై అడుగంటాయి. దీనివల్ల పశువులకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రతకు ప్రజల తాగునీటి వనరులు అడుగంటాయి. ప్రస్తుతం కొన్ని చెరువుల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి.

భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ రాజబాబు

శంఖవరం: స్థానిక సగర కాలనీలో భగీరథ మహర్షి జయంతిని సగర కులస్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పర్వత రాజబాబు ముఖ్య అతిథిగా హాజరై భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పడాల దొంగబాబు, కమ్మిలి సత్తిబాబు, బొమ్మిడి లిల్లియ్య, తంగెళ్ల సోమరాజు, నక్కా సుబ్బారావు, కర్నాటి అప్పారావు, కఠారి వెంకట అప్పారావు, ములికి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

బోట్‌క్లబ్: ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ 29వ ఆశ్రమ స్వీకారోత్సవ (పీఠారోహణ) సందర్భంగా బెంగళూరు జయ తీర్థ విద్యాపీఠ పూర్వ విద్యార్థి యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక గొడారిగుంటలోని రమాసహిత సత్యదేవ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యాత్మ తీర్థ స్వామీజీ స్వీయ పర్యవేక్షణలో దేశమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించడంలో చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఏటా విద్యార్థులను సుధా పండితులుగా తీర్చిదిద్ది సమాజానికి అందిస్తున్న గొప్ప వ్యక్తిగా కొనియాడారు. మధ్వాచార్యుల నుంచి సత్య ప్రమోదుల తీర్థులు వరకు ఉన్న స్వామీజీల మహిమలతో పాటు ఇతర మఠ విశేషాలను ప్రవచన రూపంలో సత్యాత్మ తీర్థ స్వామీజీ అందిస్తున్న ఆధ్యాత్మిక సంపద ఎంతో విలువైనదిగా పేర్కొన్నారు. ఈ ప్రాంత మధ్వ గృహస్తులకు స్వామీజీ ఆశీస్సులు నిరంతరం కలగాలన్న ఆశయంతో గురుపూజోత్సవంతో పాటు అనేక కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తున్నామన్నారు.

విజయంపై ధీమా!

- తునిలో రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగం
- విజయంపై లెక్కలు వేసుకుంటున్న పార్టీలు
- గ్రామాల వారీగా పోలింగ్ సరళిపై విశ్లేషణలు
- సంక్షేమ, అభివృద్ధికే ప్రజల మద్దతు అంటున్న వైఎస్సార్ సీపీ



తుని పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

తుని: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో ఎవరికి వారే విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు ఎవరికి ఓటు వేశారో స్పష్టత లేక పోవడంతో తర్జన భర్జన పడుతున్నారు. తుని నియోజకవర్గంలో 2,24,538 ఓటర్లు ఉండగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 83.36 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్దకు సాయంత్రం 6 గంటలకు ఓటర్లు చేరుకున్నా ఓటింగ్ పూర్తయ్యేటప్పటికి రాత్రి 10 గంటలు దాటింది. 2014లో జరిగిన ఎన్నికల్లో 76.06 శాతం, 2019లో 82.25 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఒక శాతం ఎక్కువ నమోదయ్యింది. మొత్తం 1,87,183 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు 93,988, పురుషులు 93,184 మంది ఓట్లు వేశారు. పెరిగిన పోలింగ్ శాతం ఏ పార్టీకి లాభం చేకూరుతుందోనని అభ్యర్థులు తర్జన భర్జన పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీచిన నేపథ్యంలో తుని నియోజకవర్గంలోనూ సిటింగ్ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా విజయం సాధిస్తారని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నవరత్నాలు, అభివృద్ధితో పథకాలు ప్రజల్లోకి వెళ్లాయని, ఎక్కువ శాతం ఓట్లు తమకే పడ్డాయని వైఎస్సార్ సీపీ నాయకులు అంచనాలు వేస్తున్నాయి. ఓట్ల లెక్కింపునకు జూన్ 04 వరకూ సమయం ఉండడంతో ఎవరికి వారే విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటరు దేవుళ్లు ఎవరికి పట్టం కడతారో లెక్కింపు వరకు వేచి చూడక తప్పదని విశ్లేషకులు అంటున్నారు.

తునిలో పోలింగ్ సరళి ఇలా

ఉదయం 9 గంటలకు	10.01 శాతం
ఉదయం 11 గంటలకు	22 శాతం
మధ్యాహ్నం 1 గంటకు	35.88 శాతం
సాయంత్రం 3 గంటలకు	49.88 శాతం
సాయంత్రం 5 గంటలకు	61.39 శాతం
సాయంత్రం 6 గంటలకు	68.98 శాతం
రాత్రి ముగింపు సమయానికి	83.36 శాతం

మండలాల్లో పెరిగిన పోలింగ్

సార్వత్రిక ఎన్నికల్లో మండలాల్లో ఓటింగ్ శాతం పెరిగింది. తుని పట్టణంలో 43 వేల ఓటింగ్ ఉంది. పోలింగ్‌లో మాత్రం 81 శాతం నమోదయ్యింది. కోటనందూరు, తొండంగి, తుని మండలాల్లో 83 శాతం నమోదయ్యింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మూడు మండలాలు, పట్టణంలో మెజార్టీ శాతం ఓట్లు వచ్చాయి. ఈ సారి ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు అంటున్నారు. జనసేన పార్టీ వలన టీడీపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే ఎక్కువ శాతం మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం రాత్రి వరకూ క్యూలైన్లో మహిళలు ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు నమ్మలేదని ప్రజలు చెబుతున్నారు. ఎవరిని విజయం వరిస్తుందో లెక్కింప వరకు వేచి చూడాల్సిందేనని విశ్లేషకులు అంటున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సందడి

పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో తుని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం సందడి నెలకొంది. పార్టీ విజయం కోసం నిరంతరం శ్రమించిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమాన నేత రాజాను కలుసుకునేందుకు తహతహలాడారు. తుని సిటింగ్ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా పార్టీ కార్యాలయానికి చేరుకుని నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ఎన్ని అవంతరాలు ఎదురైనా సహనంతో పోలింగ్‌ను ప్రశాంతంగా జరగడానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఎవరూ ఉద్వేగానికి లోను కావద్దని ప్రజల ఆశీస్సులే విజయాన్ని అందిస్తాయని రాజా అన్నారు. ఓటరు తీర్పుకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ప్రజా తీర్పుపై విశ్వాసం ఉందని, జననేత జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి సీఎం కావడం తథ్యమన్నారు. పోలింగ్‌లో ఎంతో కష్టపడిన నాయకులు, కార్యకర్తలు, బూత్ ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఇలా ఉంటే ప్రభుత్వ వ్యతిరేకత తమను గెలిపిస్తుందని కూటమి నాయకులు అంటున్నారు.

జగ్గంపేట నియోజకవర్గంలో 83.65 శాతం పోలింగ్



రంపయర్రంపాలెంలో పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలో సోమవరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 83.65 శాతం పోలింగ్ నమోదయ్యింది. నియోజకవర్గంలో మొత్తం 2,29,863 మంది ఓటర్లు ఉండగా 1,92,288 మంది ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 96,235 మంది, మహిళలు 96,050 మంది ఉండగా థర్డ్ జెండర్ ముగ్గురు ఉన్నారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈవీఎంలు మొరాయించడంతో గోకవరం మండలం రంపయర్రంపాలెం, ఇటికాయలపల్లి, సూదికొండ గ్రామాల్లో, గండేపల్లి మండలం మల్లేపల్లి, గండేపల్లి, మురారి గ్రామాల్లో రాత్రి వరకూ పోలింగ్ సాగింది. పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎం మెషీన్లను అర్థ రాత్రి సమయంలో పోలింగ్ సిబ్బంది కాకినాడ జేఎన్‌టీయూకి తరలించారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 80.45 శాతం నమోదు



ఏలేశ్వరంలో క్యూలో నిలబడిన మహిళలు

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో 80.45 శాతం పోలింగ్ నమోదయ్యింది. గత 2019 ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్ శాతం తగ్గింది. గత ఎన్నికల్లో 84.50 శాతం ఓటింగ్ శాతం నమోదు కాగా ఈసారి 4.05 శాతం ఓటింగ్ శాతం తగ్గింది. ఈసారి నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు ఉండగా 1,74,788 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 87,813 మంది, స్త్రీలు 86,968 మంది ఇతరులు 8 మంది ఉన్నారు. గత ఎన్నికల్లో 84.50 శాతం ఓటింగ్ నమోదయ్యింది. గతంలో 2,02,089 ఓటర్లకు గాను 1,70,766 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగింది. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ నత్తనడకన సాగింది. పోలింగ్‌లో మహిళలు భారీగా తరలివచ్చారు. ఓటర్లకు అసౌకర్యం కలడకుండా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎండ ఎక్కువగా ఉండడంతో టెంట్‌లు అందుబాటులో లేక ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

ప్రశాంతంగా ఓటింగ్: నియోజకవర్గంలో 54 సమస్యాత్మక గ్రామాలను గుర్తించగా స్వల్ప సంఘటనలు మినహా ఎటువంటి వివాదాలు జరగలేదు. ఓటింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కొండను తవ్వేస్తున్న అక్రమార్కులు



బెండపూడి శివారు పోలవరం కాలువ సమీపంలో కొండ తవ్విన దృశ్యం

తొండంగి: బెండపూడి శివారులో పోలవరం కాలువ సమీపంలో కొండను తవ్వి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. బెండపూడి జాతీయ రహదారికి సమీపంలో బెండపూడి రెవెన్యూ పరిధిలో 303 ఎకరాల భూమిని కొండతో కలిపి అన్నవరం దేవస్థానానికి బదిలీ అయింది. ఈ భూముల మీదుగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ నిమిత్తం రహదారిని అభివృద్ధి చేశారు. ఇది అక్రమార్కులకు కలిసొచ్చింది. మైనింగ్‌శాఖ, పంచాయతీ అనుమతుల లేకుండా కొందరు రియల్టర్లు, కాంట్రాక్టర్లు రాత్రి సమయాల్లో జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లు, లారీలపై గ్రావెల్‌ను అడ్డగోలుగా తరలిస్తున్నారు. రాత్రికి రాత్రే భారీగా గ్రావెల్‌ను తరలిస్తుండడంతో కొండలు తరిగిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులగానీ, అన్నవరం దేవస్థాన అధికారులగానీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు అక్రమ గ్రావెల్ తరలింపును నిలుపుదల చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీబీఎస్ఈ ఇంటర్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



షేక్ నజ్మీన్



వర్షిణి



కృపాలని పట్నోషి



విజయ్ రిషి

తుని: సీబీఎస్ఈ పది, ఇంటర్ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మంగళవారం తెలిపారు. పదిలో షేక్ నజ్మీన్ 486/500, పెనుమత్స వర్షిణి 485/500, కృపాలని పట్నోషి 484/500 మార్కులు సాధించారన్నారు. ఇంటర్‌లో వెదురుపాక విజయ్‌రిషి 91 శాతం మార్కులు వచ్చాయన్నారు. లెక్కలు, తెలుగులో 100కు 100శాతం మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ముగిసిన పోలింగ్.. ప్రశాంతంగా పల్లెలు

తొండంగి: కొద్ది నెలలుగా ఎన్నికల కారణంగా వేడెక్కిన వాతావరణం సోమవారం పోలింగ్ ముగియడంతో గ్రామాలన్నీ ప్రశాంతంగా మారాయి. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంతోపాటు ప్రచార వాహనాలు, నేతల ఇంటింటా పర్యటనలతో గ్రామాలన్నీ ఎన్నికల సందడితో హడావుడిగా మారాయి. వర్గాల సమీపకరణ, పార్టీల కండువాల మార్పులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు లాబీయింగ్‌లతో రాజకీయ వాతావరణం పూర్తిగా వేడెక్కింది. ఎన్నికల పోలింగ్ ముగియడంతో పల్లెలన్నీ ప్రశాంత వాతావరణం నెలకొంది. వ్యాపార, ప్రైవేటు ఉద్యోగాల రీత్యా దూరప్రాంతాలకు వలసె వెళ్లినవారంతా ఓట్లు వేసేందుకు వ్యయ ప్రయాసలకు గురై తరలివచ్చారు. ఓట్లు వేసిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు.

ఆంజనేయస్వామికి పూజలు

తొండంగి: గోపాలపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారి విగ్రహం వద్ద తమలపాకులతో పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులు భక్తిపాటలు భజనలు ఆలపించారు. అదేవిధంగా బెండపూడి, ఒంటిమామిడి, తొండంగి, శృంగవృక్షం బీసీకాలనీ, ఏ.వి.నగరం, దానవాయిపేట, ఎల్లయ్యపేట తదితర గ్రామాల్లో కూడా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు జరిగాయి.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఎస్.అన్నవరంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం

- నేడు మాలధారణ చేయనున్న భక్తులు

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు సేవలు అందించేందుకు పలువురు భక్తులు బుధవారం గోవింద మాలధారణ చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజు సుప్రభాత సేవ, తిరువారాధన, బాలభోగం, తీర్థప్రసాద గోష్ఠి, ద్వార తోరణపూజ, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, దర్శనాలు, అర్చనలు, పవళింపు సేవలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కార్యక్రమాలు ఇవీ

16న ఉత్సవ ఆరంభ స్నపనం (క్షీరాభిషేకం), విష్వక్సేన ఆరాధన, పల్లకీ సేవ జరుగుతుంది. 17న ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, మండలారాధన. అగ్ని ప్రతిష్ఠ, భేరి పూజ, వాహన సేవలు, 18న సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఆలయం చుట్టూ త్రీ ప్రదక్షిణ, శ్రీవారికి సహస్ర దీపాలంకార సేవ, భక్తులే హారతి సమర్పణ, శేష వాహన సేవ నిర్వహిస్తారు. 19న శ్రీకృష్ణ గోపికా పూజ, ఎదురుకోలు ఉత్సవం, రాత్రి ఏడు గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరగనుంది. 20న లక్ష్మీనారాయణ వ్రతం, శ్రీకృష్ణ తులాభారం, 21న సుదర్శన హోమం, సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, హిందూస్థానీ భజనలు ఏర్పాటు చేశారు. 22న శ్రీలక్ష్మీ నారసింహ హోమం, గరుడ వాహన సేవ, మృగయోత్సవం, రామాలయం వరకూ తిరువీధి దొంగల దీపోత్సవం, 23న మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవ వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానం, శ్రీపుష్ప యాగం, మహాదాశీర్వచనం, ఋత్విక్స న్మానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఆసుపత్రులకు మహర్దశ

- ప్రభుత్వాసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యసదుపాయాలు
- రూ.3.80 కోట్లతో నూతన ఆసుపత్రి భవనాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ భవనం

ఏలేశ్వరం: నేనురానో బిడ్డో ఈ ఊరి దవాఖానాకు అంటూ ఓ సినీకవి ప్రభుత్వాసుపత్రుల పరిస్థితిపై గతంలో ఒక పాట రాశాడు. అప్పట్లో ప్రభుత్వాసుపత్రి వెళ్లాలంటే స్వయానా నరకానికి వెళ్లినట్టుగా భావించేవారు. అలాంటి రోజుల నుంచి నేడు ప్రభుత్వాసుపత్రులంటే స్వర్గధామంగా మారాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో వాటి దిశ దశ మారిందని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ఏలేశ్వరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చాలీచాలని వసతులతోపాటు వైద్యులు, సిబ్బంది, మందుల కొరత ఎక్కువ వేధించేంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆసుపత్రి భవనం శిథిలం కావడంతో వర్షం పడితే చెరువులా మారేది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

నాడు–నేడుతో మార్పులు

సీఎం జగన్ చేపట్టిన నాడు–నేడు పనులతో ఆసుపత్రి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. రూ.3 కోట్లతో నూతన భవనాలను నిర్మించడంతో పాటు పాత భవనానికి మరమ్మతులు నిర్వహించారు. నూతన హంగులతో లేబర్‌రూమ్‌ను పునర్నిర్మించారు. గతంలో ముగ్గురు వైద్యులే ఉండగా ప్రస్తుతం పది మంది వైద్యులు ఉన్నారు. గతంలో నలుగురు సాఫ్ట్‌నర్సులు ఉండగా ప్రస్తుతం 11 మంది సాఫ్ట్‌నర్సులు ఉన్నారు. అలాగే పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించారు. దీంతో పాటు రోగులకు ఆహారం అందుబాటులో ఉండేందుకు తక్కువ ధరలతో ఆహా కాంటీన్ ఏర్పాటు చేశారు.

అర్బన్‌హెల్త్ సెంటర్‌కు నూతన భవనం


సీఎం జగన్ హయాంలో పట్టణ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పాటు రూ.80 లక్షలతో నూతన భవనం నిర్మించింది. పట్టణ ప్రజలు మరింత వైద్యసేవలు అందించేందుకు అర్బన్ హెల్త్‌సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. వీటితో పాటు రూరల్ పరిధిలోని జె.అన్నవరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో సమీప గ్రామాల్లోని ప్రజలు వైద్యసేవలను ప్రభుత్వం మరింత దగ్గర చేసింది.



నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్‌సెంటర్

మెట్ట చరితపై మరుగేల!

- ఆక్రమణలకు గురవుతున్న చారిత్రక స్థలం
- చరిత్ర చెరిగిపోతున్నా పట్టించుకోని అధికారులు
- కొండ నుంచి రాజమండ్రి గోదావరి వరకు గుహ ఏర్పాటు
- పాండవుల మెట్టకు పెరుగుతున్న యాత్రికులు
- అభివృద్ధి చేయాలని విన్నపాలు



పాండవుల మెట్టకు చేరుకోవడానికి ఏర్పాటు చేసిన మెట్లు (అంతరచిత్రం) మెట్టపై నిర్మించిన సూర్యనారాయణమూర్తి ఆలయం

సామర్లకోట: వేసవి కాలం కావడంతో సాయంత్రం సమయంలో యాత్రికులు, స్థానికులు పాండవుల మెట్టను సందర్శిస్తున్నారు. పాండవులు అజ్ఞాత వాసం చేసిన సమయంలో పెద్దాపురానికి సమీపంలో ఉన్న ఒక మెట్టపై పాండవులు నివసించినట్టు చరిత్ర చెప్తోంది. ఈ కారణంగానే ఈ మెట్టను పాండవుల మెట్టగా పిలుస్తారు. పాండవులకు సంబంధించి మహాభారతంలో ఒక చరిత్ర ఉంది. కౌరవుల చేతిలో పాండవులు జూదంలో ఓటమి చెందడంతో అజ్ఞాత వాసం చేయాల్సి వచ్చిన సమయంలో వారు పాండవుల మెట్టపై నివసించి రాజమహేంద్రవరంలోని కోటి లింగాల రేవు వరకు గుహ ఏర్పాటు చేశారు. నిత్యం గోదావరి స్నానం చేసి పూజాదికాలు నిర్వహించేవారని కథనాల ఉన్నాయి. ఈ మెట్టపై సూర్యనారాయణ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పాండవులు పూజలు చేసే వారని ప్రతీతి. నేటికీ రథ సప్తమికి ఇక్కడి సూర్య భగవానునికి ఉత్సవాలు, కల్యాణాలను, అన్నదానాన్ని అర్చకులుగా ఉన్న వై.అనంతలక్ష్మీ, ఎ. గీతావాణిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

కొండపై భీముడి గద ఉంచినట్లు, అక్కడ నిలబడడంతో ఆయన పాదాలు ఉన్నట్లు చెప్తారు. ఈ ప్రాంతంలో రాళ్ల ఒకదనిపై ఒకటి పేర్చి ఎన్ని రాళ్ల పేర్చితే అన్ని అంతుస్తుల భవనం నిర్మాణం చేస్తామని నమ్మకం ఉంది. దాంతో ఆ ప్రదేశంలో రాళ్లను భక్తులు పేరుస్తారు. అలాగే భీముడి వంటశాలను అధికారులు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే కొండపై పోలీసు సబ్ స్టేషన్‌ను నిర్మించారు. అలాగే సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేశారు. సామర్లకోట రైతు శిక్షణా కేంద్రాన్ని ఈ మెట్టపైనే నిర్మించారు. ఇటీవల మూడు ఎకరాల స్థలాన్ని శతాబ్ది పార్కు పేరుతో రూ.మూడు కోట్లతో అభివృద్ధి చేశారు. భావితరాలకు ఇటువంటి చరిత్రలు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. దీనిలో భాగంగానే ప్రముఖ దేవాలయాలను పురావస్తుశాఖ స్వాధీనం చేసుకుంది. అదే విధంగా పెద్దాపురంలోని పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి భావితరాలకు అందించాల్సి ఉంది.

గుహపై దృష్టి సారించాలి...



పాండవుల మెట్టపై ఉన్న గుహపై పర్యాటక శాఖ అధికారులు దృష్టి పెట్టాలి. ఈ గుహలోనికి వెళ్లడానికి ప్రయత్నిస్తే గబ్బిలాల వాసన వస్తుంది. వందలాది సంవత్సరాలకు చెందిన గుహ వల్ల చాలా వరకు ఇది మూసుకుపోయింది. ఈ గుహలో లైట్లు ఏర్పాటు చేసి మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం చేయాలి. పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

– కత్తుల రామ్మోహనరావు, విద్యా సంస్థ అధినేత, పెద్దాపురం